నకి ప్రేమేమిటి ? భార్య వేచివుంటుందని ఎక్కడవున్నా ఎనిమిదింటికల్లా ఇంటికి వెళ్ళిపోయేవాడు. ఎప్పుడూ పిల్లలకోసం ఇన్ని బిళ్ళలు కొని జేబులో పోసుకొని వుంచుకునేవాడు !" పైకి బింకంగా అంది అరుణ. కాని ఆమె మనస్సు ఏదో అనిర్దిష్టితవ్యథతో గిజగిజలాడింది. అప్పట్నించీ ఆ మెకళ్లు పదిమంది కనపడ్డచోటా, సినిమాహాల్సులోనూ, పార్కుల్లోనూ, రాంసింగుకోసం వెతుకుతూనే వున్నాయి. కాని రాంసింగు ఎక్కడా, ఎప్పుడూ కనపడటంలేదు—

* * *

# స్వయం బద్ధ నిర్మల

"నిజంచెప్పు !"

మళ్లీ గర్జించాడు రాజుబాబు. నిర్మల మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకుంది. మౌనం అర్ధాంగీకారం అవుతుందని నిర్మలకి తెలియందికాదు. అర్ధాంగీకారం తన ఆత్మకి పూర్ణాంగీకార మవుతుందనీ తెలుసును. అందుకనే నిర్మల ఏమీ మాట్లాడకుండా మౌనం వహించింది. ఆమౌనం రాజుబాబులో నిద్రాణమై వున్న అహంకారాన్ని రెట్టింపు చేసింది.

'పోనీ ! రోజల్లా ఒకర్తివీ ఒంటిగా కూర్చుని ఏడవాలి కదా అని వ్రాసుకోమంటే ఇదా నీ నిర్వాకం ! నీ కథల్లోకి ఎక్కించటానికి మాఫామిలీయే దొరికిందా ! మాఫామిలీయే

ఇన్స్పిరేషన్ అయ్యిందా? అంతవ్యక్తులని చూస్తేకాని ఇమేజన్ చేయలేనిదానివి, చేతులు కట్టుకొని కూర్చోవాలి కాని అందర్నీ ఏకి వ్రాసేస్తే ఊరుకుంటారా పరువునష్టం దావా వేశి, నిన్ను జుట్టుపట్టుకొని కోర్టుకీడుస్తారు. ఏమనుకున్నావో! మాట్లాడవేం? కలంతో అంత ఘోర్బగా స్పీచెస్ వ్రాయ కల్గినదానివి నాముందు మాట్లాడలేవా? ఇయ్యి! ఒక చిన్న పెద్దస్పీచ్! స్త్రీ స్వాతంత్ర్యం, సమానహక్కులూ అంటూ! వెధవ బజారు మేళం! సిగ్గువుంటేగా ముఖాలికి! ఏరోడ్డు మీద చూసినా, మనముఖమేట! ఏ స్టేజ్ మీద చూచినా మనవిగ్రహమేట! పేద్ద గాయినీమణీ, రచయిత్రీ, విచిత్రీ, అని నానెత్తికి చుట్టూరు ఈ మిస్ ఇండియాని!" విసవిసా నడుచుకొంటూ బయటకు నడిచి వెళ్ళిపోయాడు రాజుబాబు. నిర్మల తడి కళ్ళతో టేబుల్ మీదకు చూసింది. తను వ్రాసిన కథానిక ప్రచురింపబడ్డ పత్రిక పేపర్ వెయిట్ క్రింద బుద్ధిగా కప్పను మింగిన పాముల్లే కూర్చుంది. నిర్మల టేబుల్ దగ్గరగా వెళ్ళి, ఆ పత్రికను గుండెలకు హత్తుకుంది. ఆమె నరనరాల్లో వెచ్చని నెత్తురు ప్రవహించి, బుగ్గలూ, కళ్ళూ, చెవులూ, మెదడూ, వేడెక్కిపోయింది. ఆ పత్రికని ఆమె హృదయగతా వేదన్ని తనలో ఇముడ్చుకుందా అన్నంత అభిమానంతో బలంగా హృదయానికి హత్తుకుంటూ నిలబడిపోయింది రాజుబాబుకి బాగా కోపం వచ్చింది. నిర్మలకి ఏమీ తోచటంలేదు. తను వూసుపోక, అలవాటుకొద్దీ వ్రాసుకున్న కథ తన పచ్చని సంసారములో విప్లవాగ్నిని రగుల్చుతుందని తను అనుకోలేదు.

రాజుబాబుమటుకు ముందు తనను ఎందుకని ప్రోత్సహించాలీ? ఇప్పుడు ఇల్లా ఎందుకు అనుమానించి తన్ని అవమానించాలీ? తను అతని అనుజ్ఞకోరకుండగా వ్రాయలేదుగా? నిర్మల నైతిక వ్యక్తిత్వం, రాజుబాబుయొక్క అహంభావస్ఫోరకమైన మాటలతో, దహించుకిపోయింది. బజారు మేళంట! స్టేజ్ మీద పాడటం తప్పట! నిజమే! వాళ్ళింట్లో వాళ్ళవూళ్ళో ఎవరూ పాడేవాళ్ళు లేరు. అందుకని వాళ్ళకి తప్పవవచ్చును. కాని, బజారుకు వాళ్ళింట్లోనూ వెళతారే! వున్నవూళ్ళో వెళ్ళరు. కాని పొరుగూరు వచ్చారంటేమటుకు, పెద్దా, చిన్నా అన్న భేదం లేకుండగా తిరుగుతారు! ఆడవాళ్ళు నలుగురుకలిసీ, బజారుకువెళ్ళి, కావాల్సిన సామాన్లు కొనుక్కోవటం తప్పా? మనం చేయలేని పనులు ఇతర్లు చేస్తే ఘోరం అనుకునే సంకుచిత మనస్తత్వం అన్నమాట! పెదిమలతో ప్రేమ కబుర్లు చెప్తూ, డబ్బుతో శరీరాలను కొనుక్కునే అభిమాన ధనసులు! తమకు స్త్రీలను సోదరీభావంతో గౌరవించటం చేతకాదు. కనుకనే, కలివిడిగా నలుగురితో కలిసిమెలిసి వుండే స్త్రీలను అవమానించటానికి వెనుదీయరు. నిర్మల ఆలోచిస్తోంది.

నిర్మల కథలు వ్రాయటం మొదలుపెట్టిన కొద్దిరోజుల్లోనే మంచి సస్పెన్స్ రైటర్ క్రింద పేరు తెచ్చుకుంది. అది రాజుబాబుకీ తెలుసును. పెళ్ళయిన ఆరునెల్లదాకా ఏమీ వ్రాయకుండగా చేతులు ముడుచుక కూర్చుంది. అది రాజుబాబు గ్రహించాడు.

“నీ కలం మూలపడేశావేం? పెళ్ళితో, నీ బ్రిలియంట్

కెరీర్ ని. ఫేడౌట్ చేయదల్చుకున్నావా' చక్కగా వ్రాసుకో!' అన్నాడు. నిర్మల హృదయం ఆనందతరంగితమైంది

"అదే నేనూ అడుగుదామనుకుంటున్నానండి. మిమ్మల్ని పర్మిషన్ అడిగి వ్రాసుకోవాలనుకుంటున్నాను." అన్నది.

"వోహ్హా! నీకు తోచినట్లు వ్రాసుకునేదానికి పర్మిషన్ ఎందుకు. అయితే నేను నీపర్మిషన్‌తో దానికి అడగాలనివుంది" జోక్‌గా అన్నాడు.

"నాదా! ఎందుకు!" విస్మయపడింది నిర్మల, 'ఫలానా రచయిత్రి మదీయ అర్ధాంగి అని చెప్పుకుందుకు, పర్మిషన్ నాకూ కావాలి. ప్లీజ్ పర్మిట్ మీ!" చిలిపిగా అన్నాడు.

"పోండి. మీరంతా వేళాకోళం. ఇంతకీ నాసంగతేమిటీ? ప్లీజ్ గ్రాంట్ మీ..." ప్రార్ధనగా అంది నిర్మల.

"వోయస్. ఇమ్మీడియట్లీ గ్రాంటెడ్ ఆల్సో ఎ స్వీట్..."

రాజుబాబు ఆ సాయంత్రమే ఓ లెటర్ పాడూ నాలుగయిదు దస్తాల కాగితాలూ, తెచ్చిపడేశాడు. అప్పట్నించీ నిర్మల కొద్దో గొప్పో కలం ఆడించటం మొదలెట్టింది.

నిర్మకి అప్పుడప్పుడూ తన అదృష్టంమీద తనకే నమ్మకం కలిగేదికాదు. శ్రీమతి అయ్యాక కూడా, తను వ్రాసుకో కలుగుతోందంటే అది తన పూర్వజన్మ సుకృతంకాక మరేమిటో ఆమెకి అర్ధం మయ్యేదికాదు. నిర్మలకి రాజుబాబు మీది గౌరవాభిమానాలు మరింత ఎక్కువయ్యాయి పెళ్ళిపీటల మీద పెళ్ళికొడుకుగానూ, తరువాత తన్ని, ఆదరించే భర్త

గానూ, గ్రహించిన, రాజుబాబుని, ఇప్పుడు హృదయమంతటితోనూ, ఆరాధించే ప్రత్యక్ష దైవంక్రింద భావించింది. క్రొత్తలో రాజుబాబుయొక్క తొలిరోజుల మోహావేశంలో, నిర్మలకి, తను అన్న వ్యక్తి వుండేదనికానీ. ఆ వ్యక్తికి, స్వీయగతంగా కొన్ని అభిరుచులూ, ఆశయాలు, వుండేవనికానీ జ్ఞాపకం వుండేదికాదు. ఆ పరస్పర మోహప్రవెల్లువ చల్లబడగానే తను దేన్నించో వంచితురాలనై పోయానన్న స్మృతి సన్నసన్నగా, చీపురుముల్లులా గుండెల్లో గుచ్చుకుంటూండేది. అదే ఎప్పుడో ఒకప్పుడు రాజుబాబు ముందు బహిర్గతం చేయాలనుకుంటోంది. ఈలోగా ఆ వరం రాజుబాబే, అయాచితంగా ప్రసాదించాడు దానితో నిర్మల అలౌకికానందంతో రాజుబాబుయొక్క మనస్సును పూజించే పూజారిణే అయ్యింది. అవిశృంఖల వుత్సాహపు పరవడిలో, తన సంసార నావ కొట్టుకుపోయే పరిస్థితి వస్తుందని ఆమె స్వప్నమాత్రంగానైనా వూహించలేకపోయింది. ఇన్నికథలు వ్రాయగల్గిన నిర్మలవూహాశక్తికి ఈ వాస్తవికతని వూహించలేక పోయిందంటేఅది ఆమె నుదుటివ్రాత అనుకోవాలి. తన కలంతో అనేక పాత్రల నుదుటివ్రాతలను సృజించిన వ్యక్తి తన నుదుటివ్రాతని తెలుసుకోలేకపోయింది. కథలంటే ఏమిటి ? జీవితాలు మాత్రం కథలు కావా ? జీవితాలని అనుసరిస్తే కథల్లనే వుంటాయి. కథలు పరిశీలిస్తే జీవితాలల్లే వుంటాయి. ఇది శృంగారకవుల యుగంకాదు స్త్రీల, కచకుచభారాల్ని ఆధారంగా చేసుకు, కావ్యాలు సృజించటానికి పూర్వం భోగలాలసులైన రాజుల ఆదరణకోసం, స్త్రీలని శృంగారంకోసమే

సృజించినట్లు వర్ణించుతూ । వాసుకుపోయేవారు. కాని ఈనాటి సాహిత్యం ప్రజా సామాన్య సాహిత్యం! నిత్యజీవిత సమస్యలని, తమ జీవనదృక్పథంలోంచి చూస్తూ, రచన సాగిస్తారు. ఆనాటి శృంగార స్త్రీలు మత్తుగా డబ్బున్నవాళ్ళు. చక్కని జరీ పట్టువస్త్రాలతో, వెలలేని ఆభరణాలతో, రాజులు, వర్తక ప్రముఖులు, ముత్యాల పల్లకీలు, సేవకులను పంపుతోండగా తేపిగా మహారాణుల్లా జీవితపయనం సాగించేవారు. ఈనాటి శృంగార స్త్రీలు, తిండిలేక, జేడడబ్బులు దొరికితే, అణా టీ నీళ్ళు. అణా పూవులూ కొనుక్కుని కేవలం తిండీ బట్టా గడుపుకోవటానికే తమ శరీరాల్ని అమ్ముకుంటున్నారు. ఆనాటి శృంగార స్త్రీల ఇంటిముందు రాజాధిరాజులు పడిగాపులు పడేవారు. ఈనాడు, డాక్టర్ల ఇళ్ళచుట్టూ, సినిమాహాళ్ళచుట్టూ, ఈ శృంగార స్త్రీలే తిరుగుతున్నారు ఆనాటి శృంగార స్త్రీలలో వున్నత నైతికతత్వమూ, సంగీత సాహిత్య నాట్యాలలో వుత్కృష్ట నైపుణ్యాలూ వుండేవి. ఈనాటి శృంగార స్త్రీలు డొక్కచించినా అక్షరంముక్క లేకుండగా నైలాన్ చీరలు ధరించుతూ, అడ్డమైన లాడ్జింగ్ అమ్మటా తిరుగుతూ, సరయిన పోషణభారాలు వహించే దిక్కులేక రోజుకొకరుగా నశించుపోతున్నారు !! జీవితాలు ఎంతగా బురదలో కూరుకుపోతున్నాయో ఎవరికీ తెలియటం లేదు.. ఇవన్నీ నేటి కథల్లో ప్రస్ఫుటంగా చర్చిస్తున్నారు. నిర్మలకూడా ఈ విషయాలు వ్రాసింది తన కథలో! ఆమెకి భారతదేశపు వున్నత నైతిక విలువలంటే ప్రాణంతో సమానం! ఆమె తన జీవితంలో కథల్లో కూడా నైతిక విలువలకి ఎక్కువ ప్రాధాన్యత నిస్తుంది.

నీతీ, అవినీతి, ఆకలీ దారిద్ర్యం, కలిమీ బలిమీ, ఆశా నిరాశా, నిద్రా, నీరసమూ, ఏమీ స్పృశించకుండా పాత్రల సృష్టి ఎల్లా జరుగుతుంది! రాజుబాబు ఆకథ చదువుతోన్నే, నిర్మలమీద ఆగ్రహంతో విరుచుకపడ్డాడు. తన ఫామిలిలోని లూప్‌హోల్సన్నీ వెతికి, పత్రికల్లోనికి ఎక్కించటానికి కంకణం కట్టుకున్నదని అనుమానపడ్డాడు తనుకథలో సృష్టించిన పాత్ర తన అత్తవారింట్లోని ఒక వ్యక్తికి అన్వయిస్తుందని నిర్మలకి తెలియదు. ప్రతీ వ్యక్తికీ కొన్ని బలహీనతలు వుంటాయి. అవి క్షమించదగ్గవే కాని అపహసించతగ్గవి కావు. అపసించిన కొద్దీ బలహీనతలు ఇంకా విజృభించటానికి అవకాశాలు ఎక్కువవుతాయి. నైతిక పతనం చెందిన వ్యక్తుల్ని చూసి నిర్మల జాలిపడుతుంది. వాళ్ళకి సుఖజీవితాలని ప్రసాదించ భగవంతుని ప్రార్థిస్తుంది. పతితుల్ని అవహేళన చేయటం ఆమె ధ్యేయంకాదు. నిజానికి రాజుబాబు వాళ్ళ వంశ పారంపర్యంగా కొన్ని బలహీనతలు వస్తున్నాయి. అవి నిర్మలకి తెలియందికాదు. నిర్మల రాజుబాబుని మనస్ఫూర్తిగా అంగీకరించిందంటే అది ఆమె సహనశౌశీల్యాలకే ఒక పరీక్షగా పెట్టుకుందా అన్న అనుమానం కూడా కలగటం సహజం. పెళ్ళయినాక రాజుబాబుయొక్క ప్రవర్తనపట్ల ఆమె అసంతృప్తి చెందలేదు ఒకవేళ రాజుబాబులోని బహిర్గతంకాని బలహీనతలని, ఆమె గుర్తించకలిగినా, అవి ఆమె ప్రకటించటానికి ఇష్టపడదు. ఆమెలోని సహనశక్తిని అతను ఎప్పుడయితే గుర్తించ కలుగుతాడో అప్పుడే అతను తన గూఢవర్తనని, బహిర్గతంచేస్తాడు. ఈలోగా తొందరెందుకు? సంగీతాన్ని

ఆనందించటానికి సంగీతకారులుండాలి. చిత్రకళని అభినందించ టానికి చిత్రకారులుండాలి. అల్లాగే నాట్యకళని ప్రశంసించ టానికీ నాట్యకారులూ వుండాలి! అల్లాగే కథల నర్థంచేసు కుందుకు రచయితల మనస్సులే వుండాలి. ప్రతీపాత్ర సృష్టీ, ఏదో వ్యక్తిచుట్టూ గిరిగీసుకు వ్రాస్తారనుకోవటం శుద్ధపొర పాటు. పాత్రల లక్షణాలు కల వ్యక్తులుండొచ్చును. వ్యక్తుల లక్షణాలతో పాత్రల సృష్టి జర గొచ్చును. అన్నీ మామీదంటే మామీద అనుకోవటంలో అర్థం ఏముంది? తన అత్తవారి ఇంటిగుట్టులని రచ్చకెక్కిస్తే తన గౌరవమర్యాదకే భంగం! అల్లాంటి భంగకరమైనరచన తనెందుకు చేస్తుందీ! అదేనో సినిమాలో చూసినట్లు! ఒక విశృంఖల ప్రవర్తనకల యువకునికి ఒక సంస్కారిత అయిన యువతితో వివాహం అవుతుంది. ఇద్దరూ కలిసి బజారుకు వెళతారు. ఈ యువతిని చూసిన ఆతని స్నేహితులు, మన మిత్రుడి కొత్తపిట్ట భలేగావుంది'' అంటారు ఆ హీనమైన మాట వినగానే ఈ యువతికి నవనాడులూ కృంగిపోతాయి! ఆ ఘట్టం నిర్మలకెందుకనో పదేపదేగా గుర్తుంది. నిప్పుకి ఆకలెక్కువట! తనని తను దహించుకుంటూ, పరిసరాలని కూడా దహించుతుంది. అవినీతికూడా అధార్మికమైన నిప్పు వంటిది కుటుంబంలోని ఒకవ్యక్తి, అవినీతిపరుడైతే, ఆ ఛాయే ఆ ఇంటిలో పెరిగిన వాళ్ళందరికీ వస్తుంది వచ్చినా, రాక పోయినా వచ్చేసిందని లోకం అంటుంది. సాధారణంగా నిర్మల తాను ఫలానా ఇంటికోడల్నని చెప్పుకోదు. నలు గురిలో తలెత్తుకుని తిరగగల్గే నైతికవిలువలు ఆ ఇంటి వ్యక్తులకి

లేవని, అందరకూ తెలుసును. అందుకనే ఆమె తన అత్తవారి విషయాలు, వివరాలూ ఎవరికీ తెలుపదు. అల్లా గుప్తంగా వున్నా భర్త దృష్టిలో తాను ఒకరిని అవమానించి, సంతో షించే హీనురాలిగా గుర్తించబడింది! ఇంక అతను తన సహనాన్ని ఎల్లా గుర్తించుతాడు? తన కర్తవ్యమేమిటి? తన కాళ్ళమీద తనే గొడ్డలి వేసుకుందా! నిర్మల మనస్సు అవమానాగ్నితో దహించుకపోతున్నా తన్ని తను ఎల్లానో సంభాళించుకుంది. ఆఖరి ప్రయత్నంగా ఆరుపేజీల కాగితాలు వాసింది. ఆమె కన్నీళ్ళల్లో ఆమె సౌశీల్యం అంతా కరిగి పోయింది.

రాజుబాబు ఆ కోపావేశంలో రాత్రి వొంటిగంటదాకా తిరిగి ఇంటికి వచ్చాడు. బల్లమీద కథానిక ప్రచురింపబడ్డ పత్రికకోసం చూసాడు. కాని నిండా నల్లని చిన్న అక్షరాలను నింపుకున్న, తెల్లనికాగితాలు కనబడాయి. ఆతృతగా చదువు కున్నాడు.

"పూజ్యులకు,

నా సంబోధన మీకు కొత్తగా వుండొచ్చును. ఆదర్శ పవిత్ర భారతనారీమణికి భర్త ఎటువంటి ప్రవర్తన గల వాడైనా పూజనీయుడే అవుతాడు. ఆ పూర్వ భారత మహి ళల ఆదర్శాన్ని నా జీవితాంతమూ నిలుపుకోగలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఇందాక మీరన్నారు. ఒక చిన్న పెద్దస్పీచ్ ఇయ్యమని. మనిషిని ఎదురుగా

నిలబెట్టి నేను మాటలు చెప్పి కన్విన్స్ చేయగల పరిస్థితిలో లేను. ఆస్థితిలో నా చేతన జడరూపము దాల్చింది. ఇంక నా వేదన చెప్పటానికి అలవాటయిన ఈ కలమే సాయమయింది. మీ ఫామిలీయొక్క ఆంతరంగిక వివరాలు నాకు తెలియవు. తెలుసుకుందుకు ప్రయత్నించనుకూడ! ఇంక నాకే విలువలేని వివరాలు ఏమంత ప్రజోపయోగంగా వుంటాయని కథల్లోకి ఎక్కిస్తాను? అందువల్ల నాకువచ్చే లబ్ధిఏమిటి! లోకంలోని అవినీతిని తలుచుకుంటే నాశరీరం ఆత్మకూడా జలదరిస్తుంది. నా ఈ ఒక్కకథవల్ల లోకంలోని అవినీతిపరులంతా సంస్కరింపబడతారని కాదు. నా మానసికవ్యథని ఆవిధంగా ప్రదర్శించగలిగాను. ఆకథ ఎంత అవ్యక్తంగా వ్రాసానో అంత అవ్యవధానంగానూ ప్రచురింపబడింది. దాన్నించి మీరు ఎంతగానో బాధపడివుంటారు. నాకు చాలా సిగ్గుతో పాటు అనుతాపము కూడా కలుగుతోంది. అందుకు నేను క్షమార్హురాలను అవునో కాదో నాకు తెలియదు. అది మీనిర్ణయం మీద ఆధారపడివుంటుంది. చంద్రునిలో ప్రస్ఫుటంగా కళంకం కన్పిస్తున్నా. చంద్రకాంతి అందరికీ అమలకాంతి ప్రసాదిస్తోంది. అందువల్ల చంద్రుడు గౌరవనీయుడే అయినాడు. 'నైవాశ్రితేషు మహాత్తాం, గుణదోషచిన్తా' అన్నట్లు! ఒకరి గుణదోష విచారణలు నేను చేయలేను. ఏ యువతీ కోరి కోరి తన సంసారనావ సుడిగుండాల్లో పడవేసుకుందుకు వుత్సహించదు. అగ్నిసాక్షి ప్రమాణాల్లో మీకు నమ్మకంవుంటే నన్ను క్షమించటానికి ప్రయత్నించండి. నేను ఇకముందు కలం

వద్దోనని ప్రతిన చేస్తున్నాను. పెదిమలతో ప్రేమను జపిస్తూ డబ్బుతో శరీరాలను కొనుక్కొని అనుభవించే విపరీత ధనిక లాలసత్వం మిమ్ము ఆవహించదనే నాకు నమ్మకం – ఆశ ! నేను పుట్టింటికి వెళ్ళటంలేదు. అల్లా చేయటం సంసార స్త్రీకి గౌరవప్రదం కాదు. కనుక మీ అక్కగారింటికి వెళ్తున్నా. అక్కడే మనమధ్య ఏర్పడ్డ ఈ అనూహ్య అగాధాన్ని గురించి ప్రస్తావించను. మీలోని ఏమూలనున్న చిన్న సహనశక్తి అన్నా, నా ఆశాదీపం వెలిగించదా ! అన్న నిరీక్షణతో వెళ్తున్నా. నిరీక్షణ ఫలిస్తే ధన్యగా భావిస్తాను. మనమధ్య విపరీతార్థాల్ని సృజించిన ఆకథానికతో మీ బాయిలర్ రాజేసి వెళ్తున్నాను.

ఇట్లు మీ అని చెప్పుకోగల సాహసంలేని స్వయంబద్ధ నిర్మల.

* * *